క్లుప్తంగా

కామన్ సివిల్ కోడ్‌పై చర్యలు తీసుకోవాలి



ఎమ్మెల్యే భూమనకు వినతి పత్రం అందజేస్తున్న ముస్లిం పెద్దలు, ముఖ్య నేతలు

తిరుపతి కల్చరల్: కామన్ సివిల్ కోడ్ చట్టాన్ని పార్లమెంట్‌లో వ్యతిరేకించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకోవాలని ముస్లిం పెద్దలు, ముఖ్య నేతలు విజ్ఞప్తి చేశారు. వారు బుధవారం వారు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతానని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల: శ్రీవారిని బుధవారం రాష్ట్ర మంత్రి దాడిశెట్టి రాజా, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, అస్సాం గవర్నర్ గులాబ్ చాంద్ కటారియా, కేంద్ర మాజీ మంత్రి సర్వేపల్లి సత్యనారాయణ, సినీ డైరెక్టర్ పరుశురాం, తెలంగాణ కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్క దర్శించుకున్నారు. వారికి అధికారులు దర్శనం ఏర్పాట్లు చేశారు.

దళితులు, గిరిజనుల్లో వెలుగులు నింపిన సీఎం జగన్

తిరుపతి కల్చరల్: దళితులు, గిరిజనులకు ఇచ్చిన అసైన్‌మెంట్ భూములకు చట్టబద్ధత కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లారపు మధు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కేబినెట్ సమావేశంలో బుధవారం సీఎం జగన్ నిర్ణయం ప్రకటించి ఆమోదం తెలపడం అభినందనీయమని తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ దళితులు, గిరిజనుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల భూములకు రక్షణ కల్పించండి

తిరుపతి కల్చరల్: దుర్గ సముద్రం ఎస్సీ కాలనీలోని దళితులకు ఇచ్చిన తిరుపతి రూరల్ సీ రామాపురం లెక్కదాఖలా సర్వేనంబర్ 102లో 288.79 భూములకు రక్షణ కల్పించాలని ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాజు విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కొందరు ఆ భూముల నుంచి మట్టిని, ఇసుక తరలిస్తున్నారని వాపోయారు. ఆర్డీవో సూచనల మేరకు భూములకు కంచె వేసుకుంటుంటే వీఆర్వో శ్రీను అడ్డుకుని డబ్బులు చెల్లించాలని బెదిరిస్తున్నారని తెలిపారు.

గంగమ్మ మోహిత్ రెడ్డి సారె



చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం తొండవాడలో బుధవారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి నుంచి అమ్మవారి ప్రతిమకు విశేష పూజలు చేశారు. బుధవారం ఉదయం పొంగళ్లు పెట్టారు. వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం నుంచి అమ్మవారికి సారె సమర్పించారు. ఆయన తొండవాడ శ్రీ వినాయక ఆలయం నుంచి సింగల్‌విండో చైర్మన్ మల్లం చంద్రమౌళి రెడ్డి, సర్పంచ్ మల్లం దీపిక రెడ్డి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఊరేగింపుగా సారె తీసుకెళ్లారు. సింగల్ విండో మాజీ చైర్మన్ మల్ల విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ నిరంజన్ కుమార్, ఉప సర్పంచ్ బొందు సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియా, తెలంగాణ కాంగ్రెస్ నాయకుడు బట్టి విక్రమార్క దర్శించుకున్నారు. వారికి ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, ఏఈఓ రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లను చేశారు.

రాజకీయాల్లో గాంధీ కుటుంబం లేకుండా బీజేపీ యత్నిస్తోంది

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ విలేకరులతో మాట్లాడుతూ గాంధీ కుటుంబం రాజకీయాల్లో లేకుండా బీజేపీ ప్రయత్నిస్తోందని, అందులో భాగంగానే రాహుల్‌పై అనర్హత వేటు వేశారని ఆరోపించారు.

ఆకట్టుకున్న నృత్యప్రదర్శన

తిరుమల : యూఏఈలోని దుబాయ్‌కి చెందిన కూచిపూడి నృత్యకళాకారిణి ప్రీతి తాతంబొట్ల, ఆమె శిష్య బృందం బుధవారం నాదనీరాజనం వేదికపై చేపట్టిన కూచిపూడి నృత్యప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. తన్మయి ఆర్ట్ స్టూడియో ఆధ్వర్యంలో ఆమె తన శిష్యులతో కలిసి పలు కీర్తనలకు కూచిపూడి నృత్యం చేశారు. వారిని టీటీడీ అధికారులు సత్కరించి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు. స్టూడియో డైరెక్టర్ ప్రణవి చింతలపూడి, శిష్యులు రామస వెంపటి, అమత, ఛాయా జంజనం, నవ్య, ప్రవల్లిక, వైష్ణవి, సాన్వీ, నిషిక పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాల్సిందే

తిరుపతి తుడా: వలంటీర్లను మహిళలను అపహరించే ముఠాగా, విద్రోహ శక్తులుగా అభివర్ణిస్తూ పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని వలంటీర్లు నినదించారు. వారు బుధవారం తిరుపతి నగరంలో నిరసన వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలతో స్థానిక అన్నమయ్య కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ వాటిని దహనం చేశారు. వలంటీర్లలో అత్యధిక శాతం మంది మహిళలు పని చేస్తున్నారని, మహిళలను అవమానిస్తావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్ల వ్యవస్థకు క్షమాపణ చెప్పాల్సిందేనని గర్జించారు. లేకుంటే నిరసనను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇంటింటికీ వెళ్లి బండారం బయటపెడతామన్నారు.

పాకాలలో..

పాకాల: వలంటీర్లకు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని జెడ్పీటీసీ నంగా పద్మజాబాబురెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని వలంటీర్లు బుధవారం స్థానిక చిత్తూరు రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. ప్రజలకు చేస్తున్న సేవలపై ఈర్ష్యతో తప్పుడు మాటలు మాట్లాడడం తగదన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎస్.కస్తూరి, పి.కళావతి, మాజీ సర్పంచ్ లక్ష్మీ సుధ, వలంటీర్లు పాల్గొన్నారు.



తిరుపతి అన్నమయ్య కూడలి వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

నీ అభిమాని అయినందుకు సిగ్గుపడుతున్నా..



పవన్ కళ్యాణ్ నీ అభిమాని అయినందుకు నేను సిగ్గుతో తలదించుకుంటున్నాను. మహిళలపై నీకున్న అభిప్రాయం మరోసారి తేటతెల్లమైంది. వలంటీర్లను ప్రజాసేవకులుగా దేశమంతా అభివర్ణిస్తుంటే నువ్వు అసాంఘిక శక్తులుగా అభివర్ణిస్తావా?. కోవిడ్ టైంలో నువ్వు ఎక్కడ దాక్కున్నావ్ సమాధానం చెప్పు. నువ్వు ప్రాణాలకు భయపడి ఇంట్లో దాక్కుంటే, మేము ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేశాం. అలాంటి మమ్మల్ని మహిళలను అపహరించే ముఠాగా నిందలు వేస్తావా?. నీ తప్పు ఒప్పుకొని క్షమాపణ చెప్పు. లేదా ఇల్లిల్లూ తిరిగి నీ పని పడతాం. **– గీతిక, వలంటీర్, 19వ డివిజన్, తిరుపతి**

పవన్ నీకు విలువలే లేవా



వలంటీర్లను మహిళలను అపహరించే ముఠాలుగా అభివర్ణించడంపై పవన్ సిగ్గుపడాలి. విలువలు లేని వ్యక్తి కాబట్టే ప్రజాసేవలో నిమగ్నమైన మాపై నిందలు వేశారు. మహిళలంటే నీకు విలువ లేదా?. ఇదేనా మీ అమ్మ నేర్పిన సంస్కారం?. ఏమాత్రం నీకు సిగ్గు శరం ఉన్నా వెంటనే క్షమాపణ చెప్పు. లేదంటే తగిన మూల్యం చెల్లించుకుంటావు. పవన్ నీకు విలువలే లేవని తెలుసు. మరీ ఇంత నీచానికి దిగుతావని అనుకోలేదు.
– సత్య లక్ష్మి, వలంటీర్, 22వ డివిజన్, తిరుపతి

సేవలో మరింత ముందుకు



ఈమే పేరు హైమావతి. వలంటీర్‌గా పనిచేస్తున్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించినందుకు ప్రభుత్వం సేవా మిత్ర అవార్డుతో సత్కరించి పదివేల నగదు అందజేసింది. దాన్ని సైతం ఆమె సేవకు ఉపయోగించి శభాష్ అనిపించుకున్నారు.

సేవలోనే సంతృప్తి

కోవిడ్ మహమ్మారి ఉన్నత కుటుంబాలను సైతం సాధారణ పరిస్థితి తీసుకొచ్చింది. బంధుత్వాలు సైతం మంటగలిసిన పరిస్థితులను చూశాం. ఉద్యోగం చేసేందుకు వేరే అవకాశాలు ఉన్నా వలంటీర్‌గా సేవలు అందించడంలో ఎంతో సంతృప్తి ఉంది. ఇంటి వద్దకే వెళ్లి ఎంతో మందికి ప్రభుత్వ సేవలను అందిస్తున్నాను. అందుకే ప్రభుత్వం నాకు ప్రోత్సాహక బహుమతిని ఇచ్చింది. లాక్ డౌన్ సమయంలో అక్షయ క్షేత్రంలోని అభాగ్యులకు అండగా నిలవాలని భావించి ఆ డబ్బులతో పలు రకాల వంటకాలను చేసుకుని అందరికీ పంచిపెట్టి ఎంతో సంతృప్తి పొందాను. ఇందులో ఉన్న ఆనందం మాటల్లో చెప్పలేనిది.
– హైమావతి, వాలంటీర్, 8వ డివిజన్, తిరుపతి



అభయక్షేత్రానికి ఆహార పదార్థాలు అందజేస్తున్న వలంటీర్ హైమావతి (ఫైల్)

పేదల గుండెల్లో కొలువైన నేత జగన్



ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష

- రాష్ట్రంలో ప్రజారంజక పరిపాలన
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 6వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం

తిరుపతి మంగళం : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ పేదల గుండెల్లో కొలువయ్యారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, కార్పొరేటర్ కేతం జానికి, డివిజన్ అధ్యక్షుడు నాదమునిరెడ్డి, బాలాజీతో కలిసి 6వ డివిజన్ సుభాష్‌నగర్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు నాలుగేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల సంక్షేమాన్ని అడ్డుకోవడమే కాకుండా ప్రజాసేవకులైన వలంటీర్లను నోటికి వచ్చినట్లు దూషిస్తున్న పవన్‌కళ్యాణ్‌కు రాజకీయ భవిష్యత్తు ఉండదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పవన్‌కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుబాల, కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్ రెడ్డి, టి.మునిరామిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు శ్రీదేవి, 7వ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు కాసీమ్, వెంకటేష్, పాముల రమేష్‌రెడ్డి, తాలూరి ప్రసాద్, కంకణాల రమేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఆధ్యాత్మిక నగరం

తిరుపతి తుడా: తిరుపతి నగరం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి ఆటోనగర్, రాయల్ నగర్‌లో సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 11వ శతాబ్దంలో తిరుపతి పట్టణానికి శంకుస్థాపన జరిగినప్పుడు రామానుజాచార్యులను ఈ ప్రాంతానికి పిలిపించిన సామంత రాజు ఘట్టి దేవర యాదవరాయల పేరును ఆటోనగర్ మెయిన్ రోడ్డుకు పెట్టినట్టు తెలిపారు. మేయర్ శిరీష, కమిషనర్ హరిత మాట్లాడుతూ ఆటోనగర్‌లో రూ.90 లక్షలు, 18వ డివిజన్ రాయల్ నగర్‌లో రూ.70 లక్షలతో సీసీరోడ్లను నిర్మించినట్టు చెప్పారు. కార్పొరేటర్లు ఉమా, సూలోచన, వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు అజయ్‌కుమార్, శేఖర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు ఇమామ్ సాహిబ్, టౌన్ బ్యాంకు వైస్ చైర్మన్ వాసు యాదవ్, డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని వినతి

తిరుపతి కల్చరల్: కేంద్ర ప్రభుత్వం సంచార జాతుల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సీడ్ పథకం కింద వెంటనే నిధులు విడుదల చేయాలని అఖిల భారత సంచాలర జాతుల అభివృద్ధి మండలి రాష్ట్ర కోర్ కమిటీ చైర్మన్ రాపూరు డోలా క్రిష్ణ డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు.

విద్యార్థికి నగదు బహుమతి

తిరుపతి ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన ఈసెట్–2023 ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంలో 121 మార్కులతో రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన శంకరయ్యను బుధవారం శ్రీగగన కోచింగ్ సెంటర్ డైరెక్టర్ కరుణామూర్తి ప్రోత్సాహక బహుమతిగా రూ.10 వేలు అందజేశారు. ఈసెట్–2024 ప్రవేశ పరీక్ష రాసే విద్యార్థులకు తమ కోచింగ్ సెంటర్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నామని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 90140 52757, 95534 90099లో సంప్రదించాలని కోరారు.

నేటి నుంచి ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు

తిరుపతి కల్చరల్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా తిరుపతి శాఖ ఆధ్వర్యంలో గురు, శుక్రవారాలు బాలాజీ కాలనీలోని ఐసీఏఐ భవన్‌లో ఆదాయపు పన్నుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు సి.జగదీష్ కృష్ణ తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చార్టెడ్ అకౌంటెంట్స్ ఆదాయ పన్ను సమస్యలపై అవగాహన కల్పిస్తారని వెల్లడించారు.

ఆర్సీపురం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుల నియామకం

రామచంద్రాపురం: మండలంలోని 22 పంచాయతీలకు వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షులను నియమిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుప్పల్లికి ఎస్.సతీష్ కుమార్‌రెడ్డి, కొత్త వేపకుప్పానికి సీ.సుబ్రమణ్యం రెడ్డి, నెత్తకుప్పానికి బట్టే సాయి శశికాంత్, పుల్లమనాయుడుకండ్రిగకు టీ.కేశవులు రెడ్డి, ఎన్ఆర్ కమ్మపల్లికి టీ.మురళీరెడ్డి, సీకాలేపల్లికి ఇ. కేశవులురెడ్డి, రాయలచెరువుకు కె.దొరస్వామి, కొత్తకండ్రిగకు టీ. చిట్టిబాబునాయుడు, మిట్టకండ్రిగకు మోటా భూపతిరెడ్డి, పీపీపురానికి పి. భాస్కర్ రాయల్, గంగిరెడ్డిపల్లికి ఎ.సుబ్రమణ్యంరెడ్డి, కమ్మకండ్రిగకు కె. దేవరాజులు నాయుడు, సీరామాపురానికి కె. వేణునాథరెడ్డి, నెన్నూరుకు ఎన్. శ్రీకాంత్ రెడ్డి, నడవలూరుకు పి.గంగరామిరెడ్డి, గణేశ్వరపురానికి బాబునాయుడు, కమ్మపల్లికి మహేంద్రరెడ్డి, సొరకాయలపాళెంకు ప్రతాప్, రావిళ్లవారిపల్లికి ఆర్.వెంకటేష్ నాయుడు, వెంకట్రామాపురానికి నాగేంద్ర, కెకెవీపురానికి జానకిరామ్, కుప్పంబాదూరుకు బాలు నియమితులయ్యారు.



వేణునాథరెడ్డి, ఎస్. సతీష్, మురళీరెడ్డి, మహేంద్రరెడ్డి, భాస్కర్ రాయల్, కేశవులు రెడ్డి, వెంకటేష్ నాయుడు, శ్రీకాంత్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రతాప్, దేవరాజులు నాయుడు, కేశవులు రెడ్డి, గంగరామిరెడ్డి, భూపతిరెడ్డి, దొరస్వామి, జానకిరామ్, శశి, బాబునాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, చిట్టిబాబు నాయుడు, నాగేంద్ర, బాలు

భవిష్యత్తు ఎలక్ట్రిక్ వాహనాలదే



తిరుపతి రూరల్: డీజిల్, ఇంధన ముడి చమురు వాడకాన్ని తగ్గించి పర్యావరణానికి మేలు చేసే ఎలక్ట్రిక్ వాహనాలదే భవిష్యత్తు అని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. తిరుపతిలో బుధవారం బెంగళూరు–తిరుపతి మార్గంలో ఫ్రెష్ బస్సు ఈవీ బస్ ఫ్లీట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రిక్ వాహనాల రాకతో కాలుష్యం తగ్గుతుందన్నారు. ఫ్రెష్ బస్సు హరిత భారతదేశం దిశగా ముందడుగు వేస్తుందని ఫ్రెష్ బస్సు వ్యవస్థాపకుడు సుధాకర్‌రెడ్డి చిర్రా తెలిపారు. ఒక్క బస్సు ఏడాదికి 90 వేల లీటర్ల డీజిల్‌ను ఆదా చేస్తుందని, 200 టన్నుల కార్బన్‌డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గిస్తుందన్నారు.

వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, మేయర్ శిరీష తెలిపారు. వారు బుధవారం ఎస్వీ వైద్య కళాశాలలో రూ.10 కోట్లతో నిర్మించిన హాస్టల్ భవనాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సీనియర్ రెసిడెన్సీల కోసం 123 గదులతో నూతన భవనాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రూయ సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభు, రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్, ఏపీ ఎంఎస్ ఐడిసి ఈఈ లక్ష్మీపతి రెడ్డి, డీఈ రమణమూర్తి, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు వెంకటేశ్వర్లు, వసుంధర దేవి, ఏఆర్ఎంఓ యువ అన్వేష్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పెద్ద పీట

భాకరాపేట : ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందని చిత్తూరు జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండల సమావేశం బుధవారం ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీపీ యుగంధర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో ఒక సంస్థ ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ప్రకృతి వ్యవసాయం, సేంద్రియ ఎరువుల తయారీ తదితర పనులు చేస్తోందని, జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేసినట్టు పేర్కొన్నారు. జెడ్పీటీసీ స్వరూప, వైస్ ఎంపీపీ దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో దేవేంద్రబాబు, తహసీల్దార్ లోకేశ్వరి, ఈవోపీఆర్డీ మదనమోహనరాజు తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : వ్యవసాయ రంగంలోని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను వ్యవసాయ కళాశాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ జి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థ ఐటీసీలో ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించిన అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు బి.వెంకటదత్తమ్మ, రిషి, దశరథ రామిరెడ్డిని బుధవారం అభినందించారు.

నితిన్ గడ్కరికి ఘన స్వాగతం



తిరుపతి గాంధీ రోడ్: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి బుధవారం తిరుమల శ్రీవారి దర్శనం కోసం తిరుపతి చేరుకున్నారు. ఆయనకు బీజేపీ నాయకులు తాజ్ హోటల్ వద్ద ఘన స్వాగతం పలికారు. గుండాల గోపీనాథ్ రెడ్డి, అక్కినపల్లి మునికృష్ణ యాదవ్, తొండం నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఆయన గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. బుధవారం రాత్రి తిరుమలలోని ఫీనిక్స్ వెంకటేశ్వర అతిథి గృహానికి చేరుకున్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు.

ఆగష్టు కల్లా వినాయక సాగర్ సిద్ధం

తిరుపతి తుడా: వినాయక సాగర్ పనులను ఆగస్టు కల్లా పూర్తి చేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె బుధవారం పనులను పరిశీలించారు. నత్తనడకన సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, రెస్టారెంట్, బోటింగ్ పాయింట్ల ఏర్పాటు, నిర్వహణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, డిఈ విజయ్ కుమార్ రెడ్డి, ఏయికామ్ బాలాజీ, కాంట్రాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవార్డులు ప్రదానం

తిరుపతి తుడా: ఎస్వీ ఆయుర్వేద కళాశాలలో బీఏఎంఎస్ చివరి సంవత్సరం పరీక్షల్లో మొదటి ర్యాంకు సాధించిన కెఎం.అజూషకు జీవక అవార్డు, రూ.15 వేల నగదు, రెండో ర్యాంకు సాధించిన టిసి.వర్షితకు ఆయుర్వేశారద అవార్డు, రూ.10 వేలు నగదును హిమాలయ వెల్ నెస్ సంస్థ అందజేసింది. ప్రిన్సిపాల్ మురళీకృష్ణ, హిమాలయ వెల్ నెస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

గడప గడపలో చెవిరెడ్డి లక్ష్మి ఆత్మీయ పలకరింపు

తిరుపతి మంగళం : ప్రజల బాగోగులు తెలుసుకునేందుకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మీ బుధవారం తిరుమలనగర్ పంచాయతీ శేషాచలనగర్‌లో గడప గడపలో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. స్థానికులు ఆమెకు హారతులతో సాదర స్వాగతం పలికారు. చెవిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ తన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయనున్నారని, ఆశీర్వదించి ఆదరించాలని అభ్యర్థించారు. కాలనీ వాసులు మాట్లాడుతూ తాగునీటి సమస్యను పరిష్కరించాలని, మురుగు కాలువలను శుభ్రం చేసేలా చూడాలని కోరారు. శేషాచల నగర్, హరిత కాలనీ, తుడా క్వార్టర్స్ ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తూ కోళ్లు, కుక్కలు, మేకలను చంపేస్తోందని, కాపాడాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆమె వెంటనే తన భర్త ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సమాచారం అందించారు. స్పందించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆ ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టాలని అటవీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, తిరుపతి రూరల్ డివిజన్ అధ్యక్షులు నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుమలనగర్ పంచాయతీ అధ్యక్షులు గుండ్రాజు శివశంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



చెవిరెడ్డి లక్ష్మిని సాదరంగా ఆహ్వానిస్తున్న మహిళలు

ప్రమాదాలకు తావివ్వొద్దు

తిరుపతి అర్బన్: తిరుమల ఘాట్ రోడ్డులో ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆయన బుధవారం తిరుపతి డీపీటీవో కార్యాలయంలో మెకానిక్కులు, డ్రైవర్లకు అశోక్ లేలాండ్ ప్రతినిధులతో కలిసి శిక్షణ ఇచ్చారు. ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో డీపీటీవో జితేంద్రనాథ్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ మెకానిక్ ఇంజినీర్ నరసింహులు, అసిస్టెంట్ ఇంజినీర్ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

తిరుపతి కల్చరల్: బ్రాహ్మణ కుటుంబాల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఏపీ బ్రాహ్మణ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ కృషి చేస్తోందని సొసైటీ గవర్నింగ్ బాడీ సభ్యుడు సీఆర్‌కే.శేషగిరిరావు తెలిపారు. ఆర్ఎస్ మాడ వీధిలోని సొసైటీ బ్రాంచ్ కార్యాలయం వద్ద బుధవారం సొసైటీ 5వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులకు విరివిగా రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. సొసైటీ చిత్రపు హనుమంతరావు, జీబీ సభ్యులు బి.జయలక్ష్మి, పి.అపర్ణ, జి.రాధ, ఈవీఆర్‌వీ.ప్రసాద్, ఆలూరు సుమతి, ఎస్.రవి పాల్గొన్నారు.

రుయాలో భద్రత పెంచండి

తిరుపతి తుడా : రూయా ఆసుపత్రిలో భద్రత మరింత పటిష్టం చేయాలని ఆసుపత్రి నాన్ టీచింగ్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. వారు బుధవారం ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడి వాహనాలు తరచూ అపహరణకు గురవుతున్నాయని, వాటిని అరికట్టేందుకు చర్యలు అమలు చేయాలని ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షులు నైనారు వరప్రసాద్ కోరారు.

భారతీయ యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడిగా నాగార్జున

చంద్రగిరి(తిరుపతి రూరల్): భారతీయ యాదవ మహాసభ తిరుపతి జిల్లా అధ్యక్షుడిగా చంద్రగిరికి చెందిన నాగార్జున యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అప్పలరాజు యాదవ్ ఉత్తర్వులు జారీ చేశారు. నాగార్జున యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని యాదవుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.